

# రెండు జోళ్లా ఒకే గాలి

ఆ పందిట్లో హడావిడి గాలిని కదలనివ్వటం లేదు. బాగా ఉక్కగా ఉంది. అయినా అక్కడున్న అందరూ సంతోషంగా ఉన్నట్టే కని పిస్తున్నారు. గట్టిగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ అటూ యిటూ తిరుగుతున్నవాళ్ళ చూపులు పందిరి మధ్యగా తయారవుతున్న పెళ్ళి మండపంమీద పడుతున్నాయి.

అక్కడ....మండపం దగ్గర జిడ్డుముఖంతో. జారిపోతున్న పంచతో నిలబడి అజమాయిషీ చేస్తున్నాడు వెంకట్రావు. అతనికి సంతోషంగా లేదు. చాలా విసుగ్గా ఉంది. చుట్టూ గోల....పనుల్తోటి హడావిడితోటి కమ్ముకున్న అలసట....అతన్ని నిలబడనివ్వటంలేదు. లేని వోపిక కూడదీసుకుని అలా అజమాయిషీ చెయ్యటం చిరాగ్గాఉంది. దానికన్నా జారిపోతున్న పంచ ఇబ్బందిగా ఉంది. అల వాటు లేదన్నా వినకుండా....'ముఖ్యమైన పెళ్ళిపెద్దవి, జులాయిగా పేంటువేసుకోవటం బాగుండదని' కట్టపెట్టారు పంచ. దానికన్నా పని లేకుండా అస్తమానం తనవేపు చూసే బంధువులకోసం పలకరింపుగా రానినవ్వు తెచ్చుకోవటం మరీ ఇబ్బందిగా ఉంది.

చాలారోజుల తరువాత కనిపించిన బంధువులు, స్నేహితులు ఎదురుగా తిరుగుతున్నారు. వాళ్ళతో మాట్లాడాలని ఉన్నా మాట్లాడలేక పోతున్నానన్న విషయం వెంకట్రావుకి తెలుస్తూనే ఉంది. విన్నటి

మంచీ తనచుట్టూ కమ్ముకున్న నిశ్శబ్దం రెండు `మూడుసార్లు ఆలో చనని అటు తీసుకు పోయింది.

రెండేళ్ళక్రితం....ఆ రోజు తను, ఇంకా చాలామంది ఇలాగే నిశ్శబ్దంగా కూచున్నారు. అప్పటివరకు తమలో ఒకడిగా కలిపి మెలిపి తిరిగిన స్నేహితుడి శవం ఎదురుగా ఉంది. ఏం చెయ్యాలో ఎవరికీ తోచలేదు. పోయిన స్నేహితుడి బంధువుల రాకకోసం ఎదురుచూపిన ఆ గంటా, ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోలేని ఆ నిశ్శబ్దం....స్నేహి తుడు పోయాడన్న బాధ....

నిన్నటినుంచీ ఈ నిశ్శబ్దం ఆ సంఘటనని గుర్తు తెచ్చి బాధి స్తోంది. దాన్నించి తప్పించుకోటానికేనా ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడాలని ప్రయత్నించాడు ఒకటి రెండు సార్లు. ప్రయత్నించిన మాటల్ని పైకి రానీకుండా సాగుతున్న ఆలోచన తినేసింది, 'అది తప్పు....ఇంకో దారి లేదా' అన్న ఆలోచన సాగుతూనే ఉంది వెంక ట్రావులో......

మండపం కడుతున్నవాళ్ళు గట్టిగా మాట్లాడుకుంటూ పనిచేస్తు న్నారు. అక్కడో మనిషి లేకపోతే వాళ్ళు మాటల్లోపడి పని తొంద రగా చెయ్యరని అనుమానం. వాళ్ళ మాటలు పెద్దగోలలా ఉన్నాయి వెంకట్రావుకి. ఇంతలో ఎవరో వెనకనించి పిలిచారు. 'మిమ్మల్ని వోసారి రమ్మంటున్నారండి' అని. అక్కడినుంచి, ఆ గోలనుంచి కాస్సేపైనా దూరంగా వెళ్ళిపోవటానికి ఆ పిలుపు మంచి ఆసరా అయింది.

వంటలు జరుగుతున్న వేపు కదులుతూ వెంకట్రావు కాళ్ళు చెప్పాయి, అక్కడేదో అవసరం ఎదురుచూస్తుంటుందని. నిన్నటి నుంచీ అవసరాలు పెరుగుతూనే ఉన్నాయి. పెరిగే ఈ అవసరాలకి కారణంగా కనిపించేది చెల్లెలి పెళ్ళొక్కటే. నిజానికి ఆ వొక్కటే కారణం కాదు...దాని వెనుక పేరుకుపోయిన ఆచారాలు, ఆడంబ రాలు,...పెట్టుబళ్ళు చాలా ఉన్నాయి.

ఎదిగిన చెల్లెలి బరువు అప్పులో మునిగిపోకుండా దించుకోవా లనుకున్నాడు వెంకట్రావు ముందు. ఏిండుగా జీవితంలో కలిసి బతకా లనుకునే యిద్దర్ని చేరువచేసే పెళ్ళయితే అల్లా చేయవచ్చు కాని, ముద్దులు మురిపాలే ఎక్కువ ప్రాముఖ్యం వహించే పెళ్ళికి అప్పు చెయ్యక తప్పదని తరువాత గ్రహించాడు. అది తెలిసింతర్వాత తన కొచ్చే జీతంమీద తీర్చగలిగినంత అప్పే చెయ్యా లనుకున్నాడు. నిన్నటివరకూ అంతే చేశాడు. కాని నిన్నటినుంచీ అనుక్షణం అతన్ని మింగటానికి చూస్తున్నాయి అప్పులు.

ఖర్చుతో కూడిన ప్రతి పనికీ ఆచారమనో, మర్యాదనో పేరు పెట్టి దేన్నీ కాకూడదంటున్నారు చుట్టూ చేరిన పెద్దలు, డబ్బుతో ముడిపడిపోయిన ఈ పెళ్ళితతంగంలో చేస్తున్న ప్రతిపనీ అయిష్టం గానే ఉంది. ఖర్చనే కాదు. ఆ ఖర్చుకి తను తట్టుకోలేననే కాదు..... చేస్తున్నవాటిలో చాలా వాటిలో ఆచారమన్న పేరు తప్ప వేరే ఏం అర్థం కనిపించటం లేదు. ఏవేవో అర్థాలు చుట్టూ ఉన్నవాళ్ళు చెపు తున్నా, ఈ కాలానికి. నేటి బతుకులకి అవి సరైనవి కావని మనసు చెపుతోంది. అవి యథావిధిగా జరగనంత మాత్రంలో ఏర్పడే లోటేమిటో కనిపించటం లేదు.

వంటలదగ్గరికి చేరేటప్పటికి...."బియ్యం చాలవు. రాత్రికే ఇంకో బస్తా కావాల"న్నారు.

గాడిపొయ్యదగ్గర వేడికి, లోపల జరుగుతున్న సంఘర్షణకి... విన్న ఆ మాటకి....తనేదో వూపిరాడని పెద్ద గోతిలో కూరుకు పోతున్నట్టనిపించింది వెంకట్రావుకి.

'సరే' అన్నట్టు తలూపి వెనక్కి తిరిగి మళ్ళీ పందిట్లో కొచ్చాడు,

పందిట్లో వాసాల్ని. పైన తాటాకుల్ని. ఆడుకునే పిల్లల్ని. మాట్లాడుకునే బంధువుల్ని అందర్నీ చూస్తూ కదిలాయి వెంకట్రావు చూపులు. అన్నీ ఒకేలా కనిపించాయి....అరుగు దగ్గర కూచుని

స్నేహితురాళ్ళతో మాట్లాడుకున్న చెల్లెలు తప్ప.... తెల్లటి చీరలో.... గాలికి వూగుతున్న పువ్వులా అటూఇటూ కదుల్తూ మాట్లాడుతోంది...

ఎన్నో ఏళ్ళుగా అదో కల వెంకట్రావుకి. తండ్రి పోయినదగ్గర మంచి తనకున్న ముఖ్యమైన బాధ్యత అదే అనుకున్నాడు. ఏ పెళ్ళికి వెళ్ళినా కొన్నాళ్ళు చెల్లెలి పెళ్ళే కళ్ళముందు విలిచేది. చెల్లెల్ని ఎప్పుడు పెళ్ళికూతురిగా చూస్తానా అనుకునేవాడు. ఈ నాడు కళ్ళముందు చెల్లెలు పెళ్ళికూతురై వున్నా....

చెల్లెలు కూచునున్న అరుగుమీంచి కావాలనే చూపు మరల్చు కున్నాడు. ఇంక నిలబడా లనిపించలేదు. అక్కడేకాదు. ఆ ఇంట్లో ఎక్కడా ఉండా లనిపించలేదు, ఇల్లు ఇదివరకులా కనిపించటంలేదు. విన్నటినుంచీ....ఇంట్లో ప్రతిగది, అరుగు....కిటికీ....ఓగుర్తుగా, చిన్న తనం నుంచీ ఆ ఇంట్లో గడిచిన జీవితంలో ఎప్పటిదో ఓ జ్ఞాపకంగా కనిపిస్తోంది. ఇప్పుడు వాటి నన్నిటినీ వదులుకోవాలా....అన్నబాధ....

డబ్బు మరీ అవసరం అయితే ఏం చెయ్యాలో చూచాయగా ఓ ఉద్దేశం ఉంది వెంకట్రావులో....ఉన్న ఇంటిని తాకట్టు పెట్టటానికి ఎవరిదగ్గరకు వెళ్ళాలో ముందుగానే తేల్చుకున్నాడు. ఇల్లు తాకట్టు పెట్టడమంటూ జరిగితే ఇంటిమీద ఆశ వదులుకోవటమే అన్న విషయం బాగా తెలుసు.

ఈ పెళ్ళికిగాను తీసుకున్న లోను పోను వచ్చేజీతంతో ఇల్లు గడవటమే కష్టం మరో నాలుగేళ్ళవరకూ. ఇంకా అప్పుచేస్తే ఎంత జాగ్రత్తపడి కూడబెట్టినా తీర్చగలిగేవి వడ్డీతప్ప అసలు కాదనేది తెలుసు.

విన్నటినుంచీ అదే ఆలోచన. అంతవరకు గట్టునే ఉన్నాడు. తను మళ్ళీ మామూలుగా నిలదొక్కుకుని, తనమీద ఆధారపడ్డ వాళ్ళని నిలబెట్టగలనన్న ఆశ ఉంది. కాని ఇప్పుడు ఇంకా డబ్బు కావాలి అన్న ఆలోచ నొచ్చినప్పుడల్లా చిరాకు కదులుతోంది. వచ్చిన బంధువుల మీద, జరుగుతున్న ఏర్పాట్లమీద....పెళ్ళి తతంగంమీద విసుగొచ్చి చివరికి తనమీద తనకే అసహ్యం పుడుతోంది.

ఇంక అక్కడ నిలబడలేక అనుకోకుండానే పెరటివేపు వెళ్ళాడు. నీళ్ళతో ముఖం కడుక్కుని కూచుంటే ప్రాణం కాస్త కుదుట పడినట్టనిపించింది.

ఆలోచన సాగుతూనే ఉంది ఏం చెయ్యాలా అని....ఆఫీసు లోను కాక చనువున్న స్నేహితులదగ్గర ఇప్పటికే వెయ్యిదాకా అప్పు చేశాడు. ఇంకా అయిదారు వందలు కావాలి. బంధువుల దగ్గర తీసుకో వచ్చు కాని ఎప్పుడు తిరిగి ఇవ్వగలిగేది?

"చేతిలో ఖర్చుకి తగినంత డబ్బు లేకపోవడమేనా ఈ బాధ కంతా కారణం....సరైన ఖర్చు, అవసరమైందే అనిపిస్తే అప్పుచెయ్యటానికి ఇంతగా తటపటాయింపు ఉండేదికాదు తనలో. పెట్టుబడులని, అనాదిగా వస్తున్న సంప్రదాయాలని ఎన్నో అనవసరపు పనులు చెయ్యాల్సి వస్తోంది. తనలాంటి సగటు జీవితాలకి ఈ పద్ధతులు సరైనవి కావని తెలియటంవల్ల ఏర్పడుతున్న తపన ఇది....' ఆలోచన తెగక చాలాసేపు అలాగే కూచున్నాడు వెంకట్రావు.

ఆ రొంపిలోంచి, కల్మషంలోంచి బయటపడాలని వెంకట్రావు మనసు గింజుకుంటోంది. ఆడ పిల్లవాళ్ళు అణకువగా ఉండాలన్న ఆచారం అతనిలోని యవ్వనాన్ని చంపి ముసలాణ్ణి చేస్తోంది. వీటన్నిటికన్నా, ఉన్న ఒక్క చెల్లెలి పెళ్ళిలోనూ సంతోషంగా ఉండ లేక పోతున్నానే అన్న బాధ వెంకట్రావుని మరీ కుంగదీస్తోంది.

"ఒరేయ్ ఇక్కడున్నావా....నీ గురించి ఇల్లంతా వెతుకుతుం టేనూ...సరేలే....లే....నడు."

బాబయ్య గొంతులో ఆ ధ్వని గ్రహించాడు వెంకట్రావు. ఆలోచన ఒక్కసారిగా తెగిపోయింది. నాలుగడుగులు వేసేలోపలే తెలిసింది పెళ్ళికొడుకు ఎందుకో కబురుపెట్టాడని.

వెంకట్రావు వెళ్ళిం తర్వాత పెళ్ళికొడుకు పావుగంటసేపు నవ్వుతూ నట్టుతూ చెప్పాడు. "చూడండి బావగారు....ఏం లేదు. మా చెల్లాయి రేణూ లేదు. అది చిన్నప్పట్నుంచి కొంచం పెంకిది.

అందులో ఒక్కత్తే ఆడపిల్ల మూలాన్ని మరీ గారంగా పెరిగింది. మీరు లాంఛనాలకోసం తీసుకున్న చీర మరీ నాసిగా ఉందంటోంది. ఏదేనా పట్టుచీర తెప్పించండి. ఇంకో ఏవేవో అంది చిన్న చిన్నవి. మీ బాబయ్యగారితో చెప్పాను లెండి. మీరు కొంచెం దావిమనసు చిన్నబోకుండా చూడాలి మరి.''

చెప్పిందంతా విని...."దాని దేముందండి అలాగే చేద్దాం" అంటం తప్ప ఇంకేం మాట్లాడలేకపోయాడు వెంకట్రావు. మాట్లాడా లని లేకకాదు. 'నాకూ ఉన్నది ఒక్క చెల్లెలే. దాని పెళ్ళి నేను నవ్వుతూ సంతోషంగా చేసే అవకాశా న్నివ్వండి. ఈ లాంఛనాల పేరుమీద ప్రాణాల్తో నన్నుచంపి. ..ముందున్న నా బతుకులోని ఉత్సా హాన్నంతా ఖాళీ చెయ్యకండి'అని చెప్పాలనుకున్నాడు కాని ఆచారం అడ్డొచ్చింది. తలవంచుకొని వెనక్కి వచ్చేశాడు.

గది చేరగానే భుజాలమీద కండువాతీసి ఉండలా మూలకి విసి రేశాడు. కాస్సేపు గదంతా కలయతిరిగాడు. స్తిమితం చిక్కలేదు.

ఓ గంటకి పెట్లోంచి దస్తావేజులు తీసుకుని బయటికి నడిచే వరకూ అతని మనసు, వయసు, ముదిరిపోయిన చాదస్తాలతో దెబ్బ లాడుతూనే ఉంది.

* * *

రాత్రి లైట్లవెలుగులో జారిపోతున్న పంచెతో గుచ్చుకుంటున్న కండువాతో చచ్చిపోయిన మనసుతో నిలబడి చెల్లెలిపెళ్ళి చూస్తున్న.. వెంకట్రావు కళ్ళలోకి నీళ్ళు పొంగుకొచ్చాయి.

అక్కడే....పిరిగ్గా వెలిగే లైట్ల చుట్టూ, సన్నాయి చుట్టూ తిరు గుతూ ఆ పెళ్ళి చూసిన గాలికి మనసు కలుక్కుమంది. 'డబ్బులేక ఇబ్బంది పడ్డాడు పాపం' అనుకుంది వెంకట్రావుని చూసి...అనుకుని అక్కడుండలేక పందిరి మీదకి నెమ్మదిగా పాకి పూరు చివరికొచ్చి రైలెక్కింది గాలి....

* * *

ఆ పట్టణంలో రైలుదిగిన గాలి రికామీగా బైలుదేరి అక్కడికి చేరింది.

అక్కడ....ఆడంబరం అటూ ఇటూ తిరుగుతోంది. హుందా తీరుబడిగా కూచుని ముచ్చట్లాడుతోంది. బట్టల్తోపాటు ఉత్సాహాన్ని తొడుక్కొచ్చిన చాలామంది గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటున్నారు.

నాయుడుగారు విశాలంగా ఉన్న షామియానా కింద కలయ తిరిగారు....పలకరించడం అవసరం అనుకున్నవాళ్ళని పలకరిస్తూ; పలకరింపుగా నవ్వటం చాలనుకున్న వాళ్ళని చూసి నవ్వుతూ.

పెళ్ళికి రావల్సినవాళ్ళు చాలామంది వచ్చారు. స్నేహితులు పెద్దపెద్ద ఉద్యోగస్థులు; బంధువులు....తోటి పెద్ద చెయ్యి వ్యాపారస్థులు....

కాని నాయుడుగారికి తృప్తిగా లేదు. ఓ చోట నిలబడాలని లేదు. చేస్తున్న సంబంధంమీద ఆయన కంత మక్కువ లేదు. కుర్రాడు బుద్ధిమంతుడే; తెలివైనవాడే. కాని అంతస్తు, హోదా తగింది కాదని, నలుగురూ చిన్నతనంగా చూస్తారని ఆయన బాధ.

అలా తిరుగుతుంటేనే ఎవరో అడిగారు ఆయన్ని...."మీ పెద్దమ్మాయి రాలేదాండీ...." అని. ఏదో సమాధానం చెప్పి మరోమూలకి నడిచారు. కాని మనసులో ఓ మూల కలుక్కుమంటోంది. అది పెద్దమ్మాయి పెళ్ళికి యింతవరకూ రానందుకు కాదు. ఇంకాసేపట్లో పెద్దమ్మాయి వాళ్ళు ఎలాగా వస్తారని తెలుసు ఆయనకు.

రెండోకూతురి పెళ్ళి తతంగం మొదలుపెట్టిన దగ్గరనుంచి, పెద్దమ్మాయి అనగానే కళ్ళముందు నలభై వేలు కదులుతున్నాయి ఆయనకి. నలభై వేలతో సలక్షణంగా ఏ గొడవలూ లేకుండా తన అంతస్తుకు మించిన వాళ్ళతో ఆయన చేసిన ఆ సంబంధం గుర్తు వస్తోంది. అది గుర్తువచ్చినప్పుడల్లా చేస్తున్న ఆసంబంధంమీద చిన్న

చూపుగానే ఉంది. ఏమైనా సరే ఈ పెళ్ళి ఖర్చు నలభై వేలు దాటకూడ దని నిశ్చయించుకున్నారు. దాటితే అది తన అప్రయోజకత్వమే అనిపించింది ఆయనకి.

అందుకని ఈ పెళ్లిలో అవుతున్న ప్రతి చిన్న ఖర్చు నలభై వేలకి దగ్గిరగా తీసుకెడుతున్నట్టే ఉంది. డబ్బున్నా, అవసరమైనా ఖర్చు పెట్టలేడాయన ఇప్పుడు....

గంటక్రితమే కాబోయే అల్లుడు కనిపించి ముద్దుగా పలకరించాడు నాయుడుగార్ని. మళ్లీ మరోసారి గట్టిగా చెప్పాడు....మర్నాటి రిసెప్షన్‌లో తను చెప్పిన ఎంటర్‌టైన్‌మెంటు ప్రోగ్రాం ఎరేంజి చెయ్యటం మరిచిపోవద్దని.

ప్రోగ్రాంకి అయిదువేలకన్నా ఎక్కువకాదు. కాని నాయుడుగారికి యిష్టంలేదు. పెద్దపిల్ల పెళ్లిలో ఇంత పెద్ద ప్రోగ్రాం పెట్టలేదు.

అరగంట గడిచేలోపల అయిదారు వార్తలందాయి నాయుడుగార్కి కొత్త పెళ్ళికొడుకు దగ్గిరనుంచి....రాత్రి డిన్నర్‌లోకి ఫలానా డిష్ కావాలని....ఫలానాచోట ఉన్న సూట్స్ తెప్పించమని....

ప్రతి వార్తకి ఆయన పౌరుషం ఒకో మెట్టు పెరిగింది. ఆయనలో సరైన ఆలోచన అడుగంటింది. ఆస్తి, అంతస్తుల వ్యత్యాసాలు అసరాగా, అసహనం ఆయన మనసులో నిండుగా చేరింది. అందుకని ఏదీ చెయ్యకూడ దనుకున్నాడాయన. కాని ఓ పక్కన జంకుగా ఉంది....ఏం రభస జరుగుతుందో అని. అందుకే ఎక్కడా ఓ చోట స్థిరంగా ఉండలేక పోతున్నాడాయన....

* * *

షామియానా కింద మూల మూలలకి వెలుగు పాకుతుంటే, చీకటి చాటుచూసుకుని జంకుగా పిరిగ్గా నిలబడి చూశాడాయన కూతురి పెళ్లి.

పేదతండ్రి కన్నకూతురి పెళ్లిచేసి తృప్తిగా విడిచే నిట్టూర్పు

రాలే దాయనకి....కళ్ళు తృప్తిగా చెమర్చలేదు. పెళ్ళయితే అయి పోయింది కాని తర్వాత ఏం రభస జరుగుతుందో అనే భయాన్నే చూశా డాయన పెళ్ళికన్నా ఎక్కువగా.

* * *

చూస్తున్న గాలికి 'ఛీ' అనిపించింది. డబ్బుండటం లేకపోవ టమే కాదు ఈ పెళ్ళిళ్ళలో సమస్య. మనుషులు....వాళ్ళ మనుసులు. ఆడ....మగ. ఎక్కువ....తక్కువ. అన్న వ్యత్యాసాలతో నిండిన ఆచారాలు....ఇంకా చాలా....చాలా...,ఎన్నాళ్ళిలా? అనిపించేటప్పటికి కంపరమెత్తి అక్కడనుంచి కూడా కదిలిపోయింది గాలి.

('భారతి'లో ముద్రితము)